రైతులకు రేవంత్ అన్యాయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): విధ్వంసం, పరధ్యానం, పాథలాజికల్ అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డి నిపుణుడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అర్థం లేని కక్ష గట్టి రైతులకు నీళ్లివ్వకుండా రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఉరిశిక్ష విధించి దాన్ని పూర్తి చేయకుండా తన ప్రాంత రైతులకే సీఎం అన్యాయం చేస్తున్నారని ఆదివారం ఎక్స్‌వేదికగా విమర్శించారు. కృష్ణా నదిలో తెలంగాణ నీటి వాటాపై నోరు తెరవకుండా పాలమూరు ప్రాంత ప్రజలకు ముఖ్యమంత్రి ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. పోతిరెడ్డిపాడు ద్వారా వందల టీఎంసీల నీటిని ఆంధ్రాకు తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. కాళేశ్వరం నుంచి అదనపు టీఎంసీని తరలించేందుకు కేంద్రం ఆంక్షలు విధించినా కాంగ్రెస్ సర్కార్‌లో చలనం లేకుండా పోయిందని, నాడు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో కరవు తాండవిస్తే.. నేటి ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పరువు పోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రుణమాఫీపై సవాల్‌కు తోకముడిచిన ప్రభుత్వం

'అధికారం ఉన్నదని అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్తే నిజమవుతయా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ కాలేదని రైతులు ఇంకా రోడ్డెక్కుతున్నారని వాపోయారు. వందశాతం రుణమాఫీ చేసినట్టు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరితే స్వీకరించకుండా ప్రభుత్వ పెద్దలు తోకముడిచారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ కాని అన్నదాతలకు ఈ ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో మాఫీ జరిగితే రైతులు ధర్నాలు చేయాల్సిన ఖర్మ ఏంటని ప్రశ్నించారు. 'పోరాటాల గడ్డ ఇంద్రవెల్లి.. అడవుల తల్లి ఆదిలాబాద్.. ధనోరా రోడ్డు మీద కూర్చున్న రైతుల ముందే మీ మాయల మాఫీ లెక్కలు తేలుద్దాం పద' అని సవాల్ విసిరారు. ధర్నా చేస్తున్న ఫొటో క్లిప్పింగ్‌ను తన పోస్ట్‌కు జత చేశారు. 'రుణమాఫీ మాయ, రైతు భరోసా మాయ, తులం బంగారం మాయ, మహిళలకు 2500, 4000 ఆసరా పింఛన్లు, దివ్యాంగులకు 6000 పింఛన్లు మాయ' అంటూ సెటైర్లు విసిరారు.

భరోసా ఎగవేతపై బరిగీసి కొట్లాడాలె

మొదటిపేజీ తరువాయి...

కడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిపై ఊరూరా చర్చపెట్టాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన తెలంగాణ రైతాంగానికి బహిరంగలేఖ రాశారు. అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా విషయంలో స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అసలు సంగతిని అతితెలివిగా పక్కదారి పట్టించారని విమర్శించారు. రైతులు అప్రమత్తంగా ఉండి గ్రామ గ్రామాన కాంగ్రెస్ సర్కార్ వైఖరిని ఎండగట్టాలని కోరారు.

అటెన్షన్ డైవర్షన్ జిమ్మిక్కులు

'శాసనసభలో రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎటూ తేల్చలేదు. పైగా సంబంధంలేని అంశాలను చర్చకు తెచ్చి అతితెలివితో పక్కదారి పట్టించాడు. బాగా అలవాటైన అటెన్షన్ డైవర్షన్ జిమ్మిక్కులు ప్రదర్శించాడు! కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి చూస్తే కోతలు, కొర్రీలు పెట్టి రైతు భరోసాను సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ఉన్నట్టు అర్థమవుతున్నది. తిండిపెట్టే రైతుకు తొండి చేసి పైసలు ఎగ్గొట్టే పన్నాగం ప్రారంభమైంది! విధివిధానాలు, మార్గదర్శకాలు ఏమీ సభలో చెప్పకుండా సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తం అని ఒక్క మాట చెప్పి తప్పించుకున్నారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రైతన్న ప్రయోజనాలకు ఘోరీ

'రైతుబంధుకు బొందపెట్టి పనికిమాలిన షరతులు విధించి అరకొరగా రైతుభరోసా అమలు చేసి మిమ్ముల్ని నిండాముంచే పెద్ద దోఖా జరగబోతున్నది. అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. మోసపోకుండా జాగ్రత్తగా ఉండాల్సిన సందర్భమిది. స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని దాటడం కోసం మాయోపాయాలు చేసి పెట్టుబడి సాయానికి పూర్తిగా ఘోరీ కట్టే ఘోరాలు చేయబోతున్నరు. వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది ! ఇప్పుడు మేల్కోకపోతే భరోసా ఉండదు.. గోస మాత్రమే మిగులుతది. ఉమ్మడి రాష్ట్రంలో సాగుసంక్షోభంలో మునిగి వెన్ను విరిగిన తెలంగాణ అన్నదాతను ఆదుకోడానికి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయంలో విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టింది. ఆగమైన ఎవుసం బాగుపడ్డది. రైతుకు పెట్టుబడి సాయం అందించేందుకు కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం వ్యవసాయాన్ని పండుగలా మార్చడంలో కీలక పాత్ర పోషించింది. రైతు ఎవరి ముందూ పెట్టుబడి కోసం చేయిచాచే దుస్థితి లేకుండా వానకాలం, యాసంగి రెండు పంటలకు అవసరమైన పైసలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో పడే అపురూపమైన ఆలోచన ఆచరణే రైతుబంధు'అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు.

శాసనసభలో రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ఎటూ తేల్చకుండా సంబంధంలేని అంశాలను తెరపైకి తెచ్చి చర్చను అతితెలివితో పక్కదారి పట్టించాడు. బాగా అలవాటైన అటెన్షన్ డైవర్షన్ జిమ్మిక్కులను ప్రదర్శించాడు! రైతు భరోసా పథకంపై ఆంక్షలు, అనుమానాలు.. వేటికీ సమాధానం చెప్పకుండా దాట వేశారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుబంధు పథకంపై పచ్చి అబద్ధాలతో దుష్ప్రచారం చేశారు. అన్నం టపెట్టే రైతును దొంగలా చిత్రీకరించే దుర్మార్గానికి ఒడిగట్టారు!

- రైతులకు లేఖలో కేటీఆర్

హక్కుగా దక్కాల్సినదాన్ని వదులుకోవద్దు

'కుప్పకూలిన వ్యవసాయాన్ని నిలబెట్టాలన్న సంకల్పంతో ప్రతి రైతుకూ పెట్టుబడి పైసలు ఇవ్వాలని నిర్ణయించిం. మొత్తం 11 సీజన్లలో రూ. 73 వేల కోట్లను కర్షకుల ఖాతాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసింది. అవినీతికి, లీకేజీలకు తావులేని అతిపెద్ద నగదు బదిలీ పథకం రైతుబంధు. దీన్ని యావత్ ప్రపంచం మెచ్చింది. దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. మరో రూ.28 వేల కోట్లు రుణమాఫీ కింద నేరుగా రైతుల బ్యాంకు అకౌంట్లలో పడ్డయి. ఈ రెండు స్కీమ్‌ల ద్వారానే అక్షరాలా లక్ష కోట్ల రూపాయలు అన్నదాతల ఖాతాల్లో డైరెక్ట్‌గా జమైనయి. దుక్కిదున్నేవాడి దుఃఖం తీర్చాలన్న లక్ష్యంలో రైతన్న మీద ప్రేమతో ఈ బృహత్ కార్యక్రమాన్ని అమలు చేసినం. ప్రతిపైసాను సద్వినియోగం చేసుకొని పుట్లకొద్దీ పంటలు పండించి లక్షలకోట్ల సంపద సృష్టించినం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్లయినా అధికారంలోకి రావాలని అన్ని వర్గాలతోపాటు రైతాంగానికి కూడా కాంగ్రెస్ ఇష్టమొచ్చిన హామీలు గుప్పించింది. కేసీఆర్ ఎకరానికి రూ. 10 వేలే ఇస్తున్నడు.. మేం పవర్‌లోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం చేసింది. రైతుభరోసా కింద ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పింద్రు. గద్దెనెక్కిన 100 రోజుల్లో తప్పకుండా అమలు చేసి చూపుతామని గ్యారెంటీ కార్డులు ఇంటింటికీ తిరిగి పంచింద్రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచిపోయింది! ఇంతవరకు రైతు భరోసా పత్తా లేదు. రూ.15 వేలు ఇయ్యలేదు సరికదా ఉన్న రూ.10 వేలను ఊడగొట్టారు. ఇప్పటికే రెండు పంట సీజన్లు అయిపోయినయి. మూడో సీజన్ కూడా వచ్చేసింది. ఈ వానకాలం పూర్తిగా ఎగ్గొట్టింద్రు. నిన్న యాసంగి రూ.2500 కోత పెట్టింద్రు. ఈ యాసంగి ఇస్తరో లేదో తెల్వదు! మొత్తంగా ఒక్కో రైతుకు ఒక్కో ఎకరానికి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.17,500 బాకీ పడ్డది. అన్నదాతల ఖాతాల్లో పడాల్సిన పైసలివి! రైతులకు హక్కుగా రావాల్సిన సొమ్ము ఇది. దీన్ని వదులుకోవద్దు' అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

రైతు భరోసాపై కాంగ్రెస్ పరార్

'ప్రతి రైతు ఈ విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి! ఈ సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నది! రైతులందరికీ ఇస్తరా? లేదా? అని శాసనసభలో ప్రశ్నిస్తే సమాధానం లేదు! పైగా రాళ్లూరప్పలకు ఇచ్చి రైతుబంధు దుర్వినియోగం చేశారని అడ్డగోలుగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు వాదించింద్రు! సర్కారు వైఖరిని గమనిస్తే అర్థంలేని కొర్రీలు పెట్టి అరకొరగా అమలు చేసి రైతు భరోసా ఇచ్చేసినం అని చెప్పి చేతులు దులుపుకోవాలని కుట్ర చేస్తున్నట్లు అర్థమైతున్నది! ఈ కుట్రను రైతాంగం గుర్తించాలి!' అని కేటీఆర్ సూచించారు.

రైతుబంధుపై దుష్ప్రచారం

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని మయాదారి ముచ్చట్లు చెప్పిండు. ఆ మనిషే ఇప్పుడు రెండో పంటకు ఇచ్చిన రైతుబంధుపై తప్పుడు ప్రచారం చేసి కర్షకులను కించ పరిచేలా మాట్లాడుతున్నడు. ఖజానాలో సొమ్మంతా రైతులే కొల్లగొట్టినట్టు ప్రచారం చేయడం సమంజసమా? అన్నంపెట్టే రైతుపై ఆంక్షలు పెట్టడం, అనుమానించడం న్యాయమా? బక్క రైతుకే ఎందుకు ఇన్ని షరతులు? అన్నం పెట్టే వాళ్లంటే అంత అలుసా? ఎన్నికల ముందు అందరికీ అన్నీ అని చెప్పి ఇప్పుడు కొందరికే అని మాట మార్చడం మోసం కాదా? నిజానికి రైతుబంధు లబ్ధిదారుల్లో 80 శాతం దళిత గిరిజన బహుజన రైతులే ఉన్నరు. పదికరాలు పైబడి ఉన్న రైతులు 1.3 శాతం మందే ఉన్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ లెక్కలను పక్కాగా తేల్చింది. ఈ వాస్తవాలను కప్పిపుచ్చి రైతుబంధు మీద తప్పుడు ప్రచారం అందుకున్నరు' అని కేటీఆర్ వివరించారు.

రైతుకు ఎంతిచ్చినా తక్కువే!

'పంట పెట్టుబడి రైతు హక్కు. అది భిక్ష కాదు. రైతుకు ఏమిచ్చినా.. ఎంతిచ్చినా తక్కువే. రాష్ట్రంలో 47 శాతం మందికి ఉపాధినిచ్చే పెద్ద పరిశ్రమ వ్యవసాయం. రైతులు, రైతు కూలీల బతుకుదెరువు బాగుండాలంటే వ్యవసాయానికి సబ్సిడీ ఇవ్వాల్సిందే కదా! రైతన్నకు ఇచ్చే సాయాన్ని దానధర్మంగా చూడొద్దు. భారంగా కాదు, బాధ్యతగా చూడాలి. రేవంత్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 22 లక్షల మంది కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని బహిరంగ లేఖ రాశారు. రైతుతోపాటు కౌలు రైతుకు కూడా ఎకరానికి రూ.15 వేలు తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. వారంతా ఎదురు చూస్తున్నరు. రైతు భరోసా కౌలు రైతులకు వస్తుందా? అని అడిగితే సర్కారు నుంచి సమాధానం లేదు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను నిలదీయండి

'చైతన్యవంతమైన తెలంగాణ రైతాంగం కాంగ్రెస్ సర్కారు ఎత్తులను, నక్కజిత్తులను తిప్పికొట్టాలి. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు గల్లా పట్టి నిలదీయాలి. నిన్న ఎన్నికల్లో చెప్పిన మాటలేమిటి ? ఇప్పుడు చేస్తున్న మాయలేమిటి? అని మంత్రులను, ఎమ్మెల్యేలను నిగ్గదీసి ప్రశ్నించాలి. రైతుల ఆకాంక్ష ఏంటో.. అభిప్రాయం ఏంటో తెలిసేలా సెగ పుట్టించాలి. మౌనంగా ఉంటే దగా పడుతం. నోరు విప్పకుంటే అన్యాయమైపోతం. సాధించుకున్న పెట్టుబడి హక్కు గంగలో కలిసిపోతది. మీతో కలిసి మేము నడుస్తం. మీ ఆందోళనకు అండగా ఉంటం. నమ్మించి నట్టేట ముంచాలని చూస్తున్న కాంగ్రెస్‌ను పల్లెల్లో దంచికొడదాం' అని రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. 'కొట్లాట మనకు కొత్తకాదు. బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి. రైతుకు కేసీఆర్ సర్కారు ఇచ్చిన రక్షణ కవచాలను కాంగ్రెస్ ప్రభుత్వం కబళిస్తుంటే చూస్తూ ఊరుకోం' అని లేఖలో హెచ్చరించారు.

భూబంధం తెంచుతారా?

'రైతు భరోసా విధి విధానాలను నిర్ణయిస్తామని క్యాబినెట్ సబ్ కమిటీ వేసి కాలయాపన చేసింద్రు. జిల్లాల్లో సదస్సులు పెట్టి అభిప్రాయ సేకరణ అంటూ ఇంకొంత కాలం సాగదీసింద్రు. ఎన్నికల ముందు ఎవరి అభిప్రాయాలను తీసుకొని ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామన్నరు? ఇప్పుడెందుకు ఈ నాటకాలు? ఎన్నికల ఏరు దాటగానే తెప్ప తగలేస్తున్నరా? ఏడాదిగా లీకులిస్తూ ఆదాయపన్ను కట్టేవాళ్లకు, పాన్‌కార్డు ఉన్న వాళ్లకు రైతు బంధు కట్ అని పత్రికల్లో కథనాలు రాయించింద్రు. లక్షలాది మంది ఉద్యోగులకు భూమితో బంధం తెంపేస్తరా? బ్యాంకులోన్లు సులభంగా రావడం కోసం ఐటీ చెల్లించి పాన్‌కార్డు తీసుకున్న వాళ్లందరి నోట్లో మన్నుకొడతరా?' అని కేటీఆర్ నిలదీశారు.

బడేభాయ్ బాటలో చోటేభాయ్

'కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకో కుతంత్రం కూడా చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ మార్గదర్శకాలనే రైతు భరోసాకు కూడా వర్తింపజేస్తామని చెప్తున్నది. అదే గనుక జరిగితే రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా పెట్టుబడి పైసలు రావు. 70 లక్షలకు పైగా రైతులు ఉంటే 30 లక్షల మందికి కూడా పీఎం కిసాన్ అందుతలేదు. ఏటా లబ్ధిదారుల సంఖ్య పడిపోతున్నది. పీఎం కిసాన్ గైడ్ లైన్స్ పెద్ద దగా.. కాంగ్రెస్ దగా కోరులు ఢిల్లీలో పీఎం కిసాన్ మార్గదర్శకాలు వద్దంటున్నరు. గల్లీలో అవే ముద్దంటున్నరు. బడేభాయ్ బాటలోనే చోటేభాయ్ నడుస్తున్నడు. రైతు భరోసా విషయంలో కూడా ఆ తోవలోనే పోతే 40 లక్షల మంది పైగా అన్నదాతలకు మొండిచెయ్యే! రైతుబంధు మీద కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారం అంతా రైతు భరోసాకు కోతలు పెట్టే దురుద్దేశంతోనే. రియల్ ఎస్టేట్ ప్లాట్లకు, క్రషర్లకు రూ. 22 వేల కోట్లు ఇచ్చారని దుష్టబుద్ధితో దుర్మార్గ ప్రచారం చేస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తున్నది. వాస్తవం ఏమిటంటే వానకాలంలో పోల్చితే యాసంగిలో సాగు తగ్గుతుంది. పత్తి, పసుపు, చెరుకు వంటి పంటలు రెండు సీజన్లలో వేయడం సాధ్యంకాదు. కేసీఆర్ ప్రభుత్వం నాడు యాసంగిలో కూడా వానకాలం లెక్క ప్రకారమే రైతుబంధు జమ చేసింది. యాసంగిలో వేసిన రైతు బంధు పైసలను కాంగ్రెస్ గజదొంగలు దుర్వినియోగం లెక్కల్లో వేసి అన్నదాతలను దొంగలుగా చేసి చూపుతున్నరు' అని కేటీఆర్ మండిపడ్డారు.

తేజావత్ శ్రీను (ఫైల్) | భూక్యా రాజు (ఫైల్)

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక

మానుకోట, వరంగల్ జిల్లాల్లో ఇద్దరి బలవన్మరణం

కురవి(సీరోలు)/వర్ధన్నపేట, డిసెంబర్ 22 : దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో చోటు చేసుకున్నాయి. వివరాలు ఇలా.. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి గ్రామ శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన తేజావత్ శ్రీను (38)కు ఎకరం పొలం ఉన్నది. 30 గుంటల్లో మిర్చి సాగు చేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం అప్పు చేశాడు. మిర్చి తోటకు బూజు తెగులు ఆశించి పంట దెబ్బతిన్నది. పెద్ద ఎత్తున నష్టం జరగడంతో దాదాపు రూ.3 లక్షల వరకు అప్పు అయ్యింది. వీటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన శ్రీను శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబాబాద్‌లోని ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీరోలు ఎస్సై నగేశ్ తెలిపారు.

డీసీ తండాలో భూక్యా రాజు..

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండాకు చెందిన భూక్యా రాజు(40) తనకున్న 20 గుంటల భూమిని సాగు చేయడంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఇందులో రెండు ఎకరాల్లో వరి, మూడు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది దిగుబడి ఆశించినంత లేకపోవడంతో నష్టపోయాడు. నిరుడి నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో పంటలకు పెట్టుబడిగా తెచ్చిన అప్పులు రూ.10 లక్షలకు పెరిగాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనతో శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భరోసాకు భారీ కోత

మొదటిపేజీ తరువాయి...

ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం శాసనసభలో రైతు భరోసాపై ప్రభుత్వం చర్చ చేపట్టింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుబంధు పంపిణీకి సంబంధించిన గత వివరాలతోపాటు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలను సభ ముందు ఉంచుతున్నట్టు ప్రకటించారు. పీఎం కిసాన్ నిబంధనలను అసెంబ్లీలో పెట్టాల్సిన అవసరం ఏమిటి? ఇది దేనికి సంకేతం? తెలంగాణ ప్రభుత్వం కూడా పీఎం కిసాన్ మాదిరిగానే రైతుభరోసాలో కోతలు పెట్టేందుకు సిద్ధమైందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పందిస్తూ.. రైతు భరోసాలో పీఎం కిసాన్ నిబంధనల ఆధారంగా కోతలు పెడతారా? అని ప్రశ్నించగా.. ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఒకవేళ ప్రభుత్వానికి కోతల ఆలోచన లేకపోతే పీఎం కిసాన్ నిబంధనల జోలికి ఎందుకు వెళ్లిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటికే రుణమాఫీలోనూ పీఎం కిసాన్ నిబంధనలను అమలుచేసిన రాష్ట్ర ప్రభుత్వం.. కేవలం 25 లక్షల రుణ ఖాతాలకు రుణమాఫీ చేసింది.

వీరికి రైతుభరోసా గోవిందా?

ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా అర్హుల గుర్తింపునకు పీఎం కిసాన్ నిబంధనలను అమలు చేస్తే వివిధ వర్గాలకు చెందినవారికి భారీ సంఖ్యలో కోత పడటం ఖాయం. పీఎం కిసాన్ నిబంధనల్లో అతి ముఖ్యమైంది.. కుటుంబంలో ఎంతమంది రైతులు ఉన్నా సరే, ఒక్కరికి మాత్రమే పెట్టుబడి సాయం అందుతుంది. ఈ లెక్కన మిగిలిన వారికి రైతు భరోసా గోవిందా! కుటుంబంలో ఏ ఒక్కరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు, లాయర్లు, ఇంజినీర్లు, డాక్టర్లు, ఆదాయపు పన్ను చెల్లించేవారు ఉన్నా ఆ కుటుంబం మొత్తానికి పీఎం కిసాన్ రాదు. దీంతో రైతుభరోసాలోనూ వీరందరికీ పెట్టుబడి సాయం ఎగనామం ఖాయంగా కనిపిస్తున్నది.

రైతుకిచ్చే సాయం.. ప్రభుత్వానికి భారమా ?

ఆర్థికభారం నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాలో కోతలకు సిద్ధమవుతుందనే ఆరోపణలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరాకు రూ.10 వేలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇందుకోసం ఏటా రూ.24 వేల కోట్ల నిధులు అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత భారం మోసే పరిస్థితిలో లేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కోతలు పెట్టి అర్హుల సంఖ్యను తగ్గిస్తే ఆర్థిక భారం అదే తగ్గిపోతుందనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఈ విధంగా రైతు భరోసా వ్యయాన్ని రూ.10 వేల కోట్లకు పరిమితం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. అయితే ప్రభుత్వ ఆలోచనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతులకు సాయం చేయడం ప్రభుత్వానికి భారమైందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రైతులకు కోతలు పెట్టాలనే ఆలోచన కన్నా మరో దౌర్భాగ్యం లేదని వ్యవసాయ నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

శాసనసభలో మంత్రి తుమ్మల పెట్టిన పీఎం కిసాన్ నిబంధనల ప్రకారం వీరు అనర్హులు

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) కింది వర్గాలకు చెందిన వారు కుటుంబంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువమంది ఉంటే ఆ రైతు కుటుంబాలు ఈ పథకానికి అనర్హులు. ఎందుకంటే కుటుంబ యూనిట్‌గా లబ్ధిదారులను గుర్తిస్తారు.

- ప్రజా ప్రతినిధులు
- ప్రభుత్వ ఉద్యోగులు (జీతాలు పొందేవారు, పెన్షనర్లు)
- ఆదాయపు పన్ను చెల్లించేవారు: గత ఐదు అసెస్‌మెంట్ సంవత్సరాల్లో కనీసం మూడు మూల్యాంకన సంవత్సరాల్లో కనీసం రెండు వరుస సంవత్సరాలు ఆదాయపు పన్ను చెల్లించిన వారందరు.
- డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, అర్కిటెక్ట్స్ వంటి నిపుణులు ప్రొఫెషనల్ బాడీలలో నమోదు చేసుకుని ప్రాక్టీస్ చేయడం ద్వారా తమ వృత్తిని కొనసాగిస్తున్నవారు.

ఆర్థిక పరిస్థితి బాగాలేకే రైతు భరోసా ఇవ్వలేదు

మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ రూరల్, డిసెంబర్ 22: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనందునే రైతు భరోసా ఇవ్వలేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే జనవరిలోనే రైతుబంధు అందజేస్తామని చెప్పారు. రూ.2 లక్షల లోపు రైతు రుణాలన్నీ చేశామని, ఎక్కడైనా మాఫీ కాని రైతులుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు సేవచేయాలని మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సూచించారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రొండి రాజు, వైస్ చైర్మన్‌గా కనికరపు రాకేశ్, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు.

గురుకులంలో విద్యార్థిని మృతి

మెట్లపై నుంచి జారిపడి కన్నుమూత

జహీరాబాద్, డిసెంబర్ 22 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం బూచినెల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో మెట్ల రేలింగ్ నుంచి ప్రమాదశాత్తు జారిపడి ఓ విద్యార్థిని మృతి చెందింది. చిరాగ్‌పల్లి పోలీసులు, అధ్యాపకుల వివరాల ప్రకారం.. జహీరాబాద్‌లోని జమాల్ కాలనీకి చెందిన షాదిహా మెహరీన్(14) గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. శనివారం రాత్రి స్టడీ ఆవర్ తర్వాత రెండో అంతస్తుకు రేలింగ్ మెట్ల గుండా వెళ్తున్న క్రమంలో ప్రమాదశాత్తు కిందకు జారిపడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో సిబ్బంది జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. చిరాగ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సందర్శించారు.

ముంపు గ్రామాల్లో నయా దందా

- 'మధ్యమానేరు' పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్లతోపాటు పట్టా, పరిహార ప్యాకేజీ ఇప్పిస్తామని దరఖాస్తుల స్వీకరణ
- కాంగ్రెస్ నాయకుల కొత్త అవతారం?
- నేరుగా పంచాయతీ కార్యాలయంలోనే మకాం

కరీంనగర్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్లతోపాటు 18 ఏండ్లు నిండిన వారికి పట్టా, పరిహార ప్యాకేజీ ఇప్పిస్తామంటూ శ్రీరాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేరు) ముంపు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు నయా దందాకు తెరలేపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు కూర్చొని అధికారులతో సంబంధం లేకుండా నేరుగా తామే దరఖాస్తులు తీసుకోవడంపై విమర్శలొస్తున్నాయి. శ్రీరాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) ముంపు గ్రామాల్లోని 4,696 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. వీటికి సంబంధించి ఇంకా విధి విధానాలు రావాల్సి ఉన్నది. ప్రభుత్వ ఉత్తర్వులను ఆసరాగా చేసుకున్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే దందా మొదలు పెట్టారు. ఇందిరమ్మ ఇండ్లతోపాటు 18 ఏండ్లు నిండిన వారు పట్టా